'చెత్త'శుద్ధి లేదు..

రోడ్డు పక్కనే చెత్తాచెదారం
ప్రధాన రోడ్ల వెంట వ్యర్థ పదార్థాలు
వెదజల్లుతున్న దుర్గంధం

మంచాల: బోడకొండలో ఇండ్ల పక్కనే చెత్తాచెదారం

మంచాల, మార్చి 12: మండల పరిధిలోని ఎల్లమ్మ తండా, బోడకొండతో పాటు తదితర తండాల్లో పారిశుధ్య సమస్యతో ప్రజలు నిత్యం సమతమమవుతున్నారు. ఈ తండాల్లో ఎక్కడ చూసినా ప్రధాన రోడ్లకు ఇరువైపులా చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తున్నాయి. ఈ తండాల్లో రోడ్లపై చెత్తాచెదారాన్ని పారబోయడంతో దుర్గంధం వెదజల్లడమే కాకుండా డంపింగ్ యార్డును తలపించేలా చెత్త దర్శనమిస్తున్నది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. గతంలో చెత్తాచెదారాన్ని గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా సేకరించేవారు. కానీ ఇప్పుడు గ్రామ పంచాయతీ ట్రాక్టర్ వస్తుందో తెలియని పరిస్థితి తండాల్లో నెలకొన్నది. ప్రజలు, వ్యాపారులు వ్యర్థపదార్థాలను రాత్రికి రాత్రే రోడ్డు పక్కన పారబోస్తున్నారు. ఇకనైనా అధికారులు మేల్కొని రోడ్డు పక్కన వేసిన చెత్తాచెదారాన్ని తొలగించి దుర్గంధం నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

లబ్ధిదారులకు తెల్లరేషన్ కార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

అర్హులందరికీ తెల్లరేషన్ కార్డు

ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్లటౌన్, మార్చి 12: అర్హులైన ప్రతి పేదవాడికి తెల్లరేషన్ కార్డును అందజేస్తామని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. బుధవారం చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో లబ్ధిదారులకు మంజూరైన రేషన్ కార్డులు, బియ్యం పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల తహసీల్దార్ కిష్టయ్య, చేవెళ్ల మాజీ జడ్పీటీసీ కృష్ణారెడ్డి, చేవెళ్ల గ్రామ మాజీ సర్పంచ్ ఆగిరెడ్డి, రెవెన్యూ అధికారులు మహేశ్, నాయకులు జనార్దన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మొయినాబాద్, మార్చి12: గత ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భాస్కర్ అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్ నగర్ గ్రామ రెవెన్యూలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు ఎంపికైన లబ్ధిదారులకు కేటాయించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా చేపట్టి డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అజీజ్‌నగర్ రెవెన్యూలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లకు విద్యుత్ సరఫరాతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించి అసంపూర్తిగా ఉన్న ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం చేవెళ్ల డివిజన్ కన్వీనర్ దేవేందర్, మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, కమిటీ సభ్యులు ప్రభుదాస్, అరుణ్ కుమార్, శ్రీనివాస్, ట్రాన్స్‌పోర్టు యూనియన్, సీఐటీయూ మండల అధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.

కుప్పలు తెప్పలుగా చెత్త

ప్రభుత్వ దవాఖాన పక్కనే వ్యర్థాల పారబోత
చెత్త ఎత్తని మున్సిపల్ సిబ్బంది

మొయినాబాద్, మార్చి12: మున్సిపాలిటీ పరిధిలో చెత్త ఎక్కడపడితే అక్కడ దర్శనం ఇస్తుంది. మున్సిపల్ అధికారులు పర్యవేక్షణ లోపం.. సిబ్బంది నిర్లక్ష్యంతో చెత్త కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నది. జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ దవాఖాన గోడను ఆనుకుని చెత్తను విచ్చలవిడిగా పారబోస్తున్నారు. వ్యాపారులు తమ చెత్తను మున్సిపల్ సిబ్బంది చెత్త సేకరణ కోసం వచ్చినప్పుడు కాకుండా రాత్రి సమయంలో చెత్తను రోడ్డు పక్కనే వేస్తున్నారు. దీంతో దవాఖానకు వచ్చే రోగులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ సిబ్బంది చెత్తను ఎత్తకుండా కాల్చి రోడ్డు పక్కనే అలానే వదిలేస్తున్నారు. రోడ్డు పక్కన చెత్త వేసే దుకాణాల వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ దవాఖాన పక్కన దర్శనమిస్తున్న చెత్త కుప్ప

చెత్తను కాల్చి వదిలేసిన దృశ్యం

కొత్తూరు: పెద్దగుట్ట తండాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు, ఫిబ్రవరి 12: పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు మండల పరిధిలోని మక్తగూడ, పెద్దగుట్ట తండాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకర్ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న పేదలకు ఇది గొప్ప అవకాశమన్నారు. మొదటి పెద్దగట్టతండాల్లో నింటి నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం మక్తగూడలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతి, గ్రామ స్పెషల్ ఆఫీసర్ సందీప్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాందాస్‌నాయక్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ కృష్ణయాదవ్, మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, నాయకులు నర్సింహ, కుమారస్వామి, ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, దయానంద్ గుప్తా, మల్లేశ్, రాజు, శేఖర్, మోడీ దర్శన్, శ్రీను, శ్రీరాములు, శ్రీను, సిద్దుగౌడ్, శంకర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అప్పారెడ్డిగూడలో..

నందిగామ : మండలంలోని అప్పారెడ్డిగూడ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు చంద్రపాల్‌రెడ్డి, కొమ్ముకృష్ణ, కుమారస్వామిగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ నర్సింహ, మల్లేశ్, కాంగ్రెస్ నాయకులు నర్సింహ, కృష్ణ, సీతారం, ప్రతాప్, ప్రభాకర్, యాదయ్య, నర్సింహ పాల్గొన్నారు.

ఫరూఖ్‌నగర్ మండలంలో ..

షాద్‌నగర్‌రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలంలోని హాజిపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద గుర్తించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామంలో మంజూరైన 28 ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో బన్సిలాల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మాజీ జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఇబ్రహీం, బాలరాజ్‌గౌడ్, ప్రవీణ్, శేఖర్ పాల్గొన్నారు.

మూగజీవాలకు సకాలంలో చికిత్స అందివ్వాలి

ఇబ్రహీంపట్నం, మార్చి 12 : వేసవిలో మూగజీవాలకు రోగాలు సోకకుండా సరైన వైద్యచికిత్సలు నిర్వహించాలని పశువైద్యాధికారి ఆనంద్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చర్లపటేల్‌గూడ గ్రామంలో బుధవారం ఉచిత పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 49 పశువులకు గర్భకోశ, 30 పశువులకు సాధారణ చికిత్సలు అందించారు. 70 పశువులకు నట్టల నివారణ మందులు వేశారు. 105 పశువులకు ముద్దచర్మవ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మూగజీవాలకు ఎలాంటి వ్యాధులు సోకినా సకాలంలో చికిత్సలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో గోపాల మిత్రలు జగన్, సతీశ్, వెంకట్‌రెడ్డి, సురేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశువుకు చికిత్స చేస్తున్న వైద్యుడు

సాఫీగా ఇంటర్ పరీక్షలు

కేశంపేట, మార్చి 12: మండల పరిధిలోని కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షల కేంద్రాన్ని కేశంపేట తహసీల్దార్ మీర్ ఆజంఅలీ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పొలిటికల్ సైన్స్, బొటని-2 పరీక్షలకు 165మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ మల్లేశ్ తెలిపారు. కొత్తపేటలో పరీక్షలు సాఫీగా సాగుతుండడంపట్ల తహసీల్దార్ మీర్ ఆజం అలీ సంతృప్తి వ్యక్తం చేసినట్లు వివరించారు. సిట్టింగ్ స్క్వాడ్ శివకుమార్ పరీక్షల తీరును పరిశీలిస్తున్నారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కేశంపేట పోలీసులు బందోబస్తు చేపట్టినట్లు వివరించారు.

పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం

మొయినాబాద్, మార్చి12: మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించేందుకు బిల్డర్ హర్షారెడ్డి ముందుకొచ్చి రూ.20 లక్షలు అందజేశారు. బుధవారం మండల విద్యాధికారి వెంకటయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య స్పందన కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ డైరెక్టర్ గుణశేఖర్ కలిసి బుధవారం మరుగుదొడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనార్దన్ రెడ్డి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు హమీద్, స్పందన కన్‌స్ట్రక్షన్ సూపర్‌వైజర్ నరేశ్, గ్రామస్తులు శ్రీకాంత్, మహేశ్‌యాదవ్, హరి, శ్రవణ్‌కుమార్, సందీప్‌రెడ్డి, సాయిరెడ్డి, ప్రవీణ్‌యాదవ్ పాల్గొన్నారు.

మరుగు దొడ్లను పరిశీలిస్తున్న మండల విద్యాధికారి వెంకటయ్య

ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దు

మొయినాబాద్, మార్చి12: రిజర్వేషన్ వర్గీకరణ తేల్చే వరకూ గ్రూప్స్ నియామాకాలు చేపట్టవద్దని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మహేందర్ అన్నారు. మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెండు రోజులుగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు విడుదల చేసిన గ్రూప్స్ నియామకాలు చేపట్టవద్దన్నారు.ఎస్సీ వర్గీకరణను అనుసరించి ఉద్యోగాల వాటాను తేల్చాల్సి ఉందని చెప్పారు. సర్కార్ మొండివైఖరితో నియామకాలు జరిపితే మరోసారి ఉద్యమానికి మాదిగలు సిద్ధం అవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు భిక్షపతి, భాస్కర్, కృష్ణ, ఏసు రత్నం, కుమార్, జాన్, సురేశ్, అనిల్, దీప్, కుమార్, బాలు, గోపాల్, సాకేత్, దినేశ్, ప్రేమ్‌కుమార్, వికాస్, సామెల్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు

మహరాజ్ యూత్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

మంచాల, మార్చి 12: మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో మహరాజ్ యూత్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే నిధుల నుంచి రూ. 5లక్షలు మంజూరయ్యాయి. బుధవారం సహకార సంఘం చైర్మన్ హనుమంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింహ, కృష్ణ, రాములు, లక్ష్మణ్, భాషా, రమేశ్, రాములు, చంద్రయ్య, సురేశ్, కుమార్, బాల్‌రాజ్, శ్రీకాంత్, రాయుడు, నాగరాజు, ఐలయ్య పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న నాయకులు

యువత క్రీడల్లోనూ రాణించాలి

కడ్తాల్, మార్చి 12: మండల పరిధిలోని రావిచేడ్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ బుధవారం సాయంత్రం ముగిసింది. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో నాయకులు పాల్గొని మాట్లాడారు. యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని తెలిపారు. అనంతరం టోర్నీలో తొలి స్థానంలో నిలిచిన శివ జట్టుకు చేగూరి రాజు రూ.5,116, రెండో స్థానంలో నిలిచిన జైభీం టీంకు రమేశ్ రూ.4,116 అందజేశారు. అదే విధంగా విక్రాంత్ రూ.4 వేలతోపాటు క్రీడా సామగ్రిని అందజేయగా, చందు రూ.3,116, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్ రూ.1,300 అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రశాంత్, రవికుమార్, వంశీ, రవి, నరేశ్, చింటూ, పవన్, సాయి, రామకృష్ణ పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

సరుకులను తీసుకుంటున్న పంచాయతీ కార్మికులు

కేశంపేట, మార్చి 12: మండల పరిధిలోని సంగెం గ్రామ పంచాయతీ కార్మికులకు గ్రామ కార్యదర్శి సందీప్ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులకు పంచాయతీ పరంగా సరుకులను అందజేశామన్నారు. కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని బెల్లంతోపాటు ఇతర సరుకులు ఆరు నెలలకు సరిపడా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు పాండు, రాజు, యాదగిరి, రమేశ్, చెన్నమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

పోలీసుల అదుపులో పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

కేశంపేట, మార్చి 12: రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తరుణంలో కేశంపేట మండల మాజీ సర్పంచ్‌లను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని మాజీ సర్పంచ్ నవీన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకోవడంతో ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారన్న విషయాన్ని తెలుసుకొని వెనుదిరిగారు. అదేవిధంగా పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడంతో అసెంబ్లీ సమావేశాలను ముట్టడిస్తారన్న అనుమానంతో వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

ఇబ్రహీంపట్నం : గ్రామాల్లో మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం చలో సెక్రటరియేట్ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరుతున్న పలువురు సర్పంచ్‌లను ఇబ్రహీంపట్నం పోలీసులు బుధవారం ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు బల్వంత్‌రెడ్డి, యాదగిరి, రవణమోని మల్లీశ్వరి జంగయ్యలతో పాటు పలువురు సర్పంచ్‌లను సెక్రటరియేట్ వెళ్లకుండా ముందస్తుగా అరెస్టులు చేసి ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో గతంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

తైబజార్ వేలం పాట

ఆమనగల్లు, మార్చి 12: ఈ నెల 20వ తేదీన తైబజార్, కోడి వ్యర్థాల సేకరణకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు కమిషనర్ పురపాలక సంఘం ఆమనగల్లు పేరిట తైబజార్ కోసం రూ.2.75 లక్షల డీడీ, కోడి వ్యర్థాల సేకరణ కోసం రూ. 25 వేల డీడీ ఎస్‌బీఐ లేదా ఏదైనా జాతీయ బ్యాంకు ఆమనగల్లు నందు తీసి 19వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పురపాలక సంఘం కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

నేడు ప్రజావేదిక

షాబాద్, మార్చి 12: నేడు షాబాద్ మండలానికి సంబంధించిన ఉపాధిహామీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అపర్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా షాబాద్ మండలంలోని 41 గ్రామ పంచాయతీలు, అనుబంధ గ్రామాల్లో 1-04-2023 నుంచి 31-03-2024 వరకు జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి 15వ సామాజిక తనిఖీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కూలీలకు చెల్లించిన వేతనాలు, పనుల నాణ్యత, ఇతర పనులపై సమగ్ర నివేదికలను గురువారం షాబాద్ మండల కేంద్రంలోని ఉపాధిహామీ కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశానికి సంబంధిత అన్ని గ్రామాల ప్రత్యేకాధికారులు హాజరుకావాలని ఆమె సూచించారు.

ముగ్గురు రిమాండ్

ఆమనగల్లు, మార్చి 12: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాయన్‌పల్లి తండాకు చెందిన జటావత్ గోపాల్, ఆయన భార్య తారి, కుమారుడు చింటూ భూమి విషయంలో నెల 4వ తేదీన జటావత్ గోపాల్ తన తల్లిదండ్రులైన సీతి, పాండ్యాలతో గొడవపడి భార్య తారి, కుమారుడు చింటూతో కలిసి దాడి చేశారు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకుని బుధవారం జడ్జీ ఎదుట ప్రవేశపెట్టి జైలుకు పంపినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

ప్రతిఒక్కరూ శుభ్రతను పాటించాలి

అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సుధారాణి

మంచాల, మార్చి 12: మండల పరిధిలోని జాపాల గ్రామంలో గురునానక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ విభాగానికి చెందిన విద్యార్థులు మూడు రోజుల పాటు వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బుధవారం ముగింపు సమావేశంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పి.సుధారాణి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని చెప్పారు. వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అంతేకాకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులు జాపాల పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీమ్లానాయక్, గురునానక్ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలకు చేయూత

పాఠశాలలో విద్యార్థులకు తాగు నీటి క్యాన్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఆదిబట్ల, మార్చి 12: బొంగుళూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఎంకేఆర్ ఫౌండేషన్ సభ్యులు చేయూతనిచ్చారు. విద్యార్థులు తాగు నీరు లేక ఇబ్బందులు పడుతుండటంతో బుధవారం బీఆర్ఎస్ విద్యార్థి, యువజన సంఘం నాయకులు బొంగుళూరు ఆదర్శ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నాయకులు జెర్కోని రాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో సందర్శించామన్నారు. తాగు నీరు అందించడానికి వాటర్ క్యాన్లతో పాటు ఫిల్టర్ వాటర్‌ను అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, యువజన విభాగం నియోజకవర్గ ప్రచార కార్యదర్శి గణేశ్‌గౌడ్, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌నాయక్, బీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

యాచారం, మార్చి12: అక్రమంగా తరలిస్తున్న 15క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని యాచారం పోలీసులు బుధవారం పట్టుకున్నారు. దీనికి సంబంధించి సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని చింతపట్ల గ్రామ శివారులో అనుమానాస్పదంగా వెళ్తున్న బొలెరా వాహనాన్ని పోలీసులు గుర్తించారు. వాహనాన్ని ఆపి డ్రైవర్‌ను ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పకపోవడంతో పోలీసులు వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో 30బస్తాలలో 15క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. కడ్తాల మండలం, ఎక్వాయపల్లి గ్రామానికి చెందిన ఏదుల నర్సింహ కడ్తాల్, యాచారం గ్రామాల పరిధిలో ప్రజల నుంచి పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, ఎక్కువ మొత్తంలో జమ చేసిన తరువాత వాటిని ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో డ్రైవర్ జంగయ్యను అదుపులోకి తీసుకొని బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యాచారంలో అన్నదానం

యాచారం, మార్చి12: మండల కేంద్రంలో నిర్మించిన రామాలంలో బుధవారం సీతారామ సమేత లక్ష్మణ, ఆంజేయయుడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో వచ్చేసి ఈ మహోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.